❖•❖•❖ 28 ❖•❖•❖

# “క్రమానుగత క్రమము”

*“నీకు ఉపదేశింపబడిన సంగతులు నిశ్చయముగా జరిగినవని నీవు తెలిసికొనుటకు వాటినన్నిటిని మొదటనుండి తరచి పరిష్కారముగా తెలిసికొనియున్న నేనును నీ పేరట వాటిని గూర్చి వరుసగా రచించుట యుక్తమని యెంచితిని” (లూకా 1:2-4).*

“... నీవు తెలిసికొనుటకు ... నీ పేరట వాటిని గూర్చి *వరుసగా రచించుట* యుక్తమని యెంచితిని” అని లూకా సువార్త సందేశం గూర్చి చెప్పుచున్నాడు (లూకా 1:3). సువార్త కథనము తొలిపలుకులలో ఆయన రచించిన మాటలు ఆయన సంకలనము చేయుచుండిన సువార్త కథ అంతటిని మొత్తంగా సూచిస్తున్నాయి, కానీ మనము ఆయన మాటలను ఎరువుతెచ్చుకొని వసతిగా వాడుకొందుము. ఆ మాటలను ప్రత్యేకంగా యేసు తీర్పులకు అన్వయించుదాము. పరిశుద్ధాత్మ ప్రేరేపణ చొప్పున మత్తయి, మార్కు, లూకా, మరియు యోహాను వ్రాసిన సువార్తలలో లిఖింపబడిన నివేదికలను పొందికగా మేళవించుట ద్వారా మాత్రమే యేసు సిలువ మరణము నొందవలెనను తుది తీర్పును ప్రకటించుటకు ముందు

సంభవించిన సంఘటనల వరుస క్రమమును ఒక్క చోట కూర్చగలము. తత్ఫలితంగా, "తీర్పుల సమయంలో వాస్తవంగా ఏమి జరిగింది?" అను ప్రశ్నకు సమాధానంగా ఈ క్రింది సంఘటనల షుమారైన జాబితాను సంకలనము చేయవచ్చును.

(1) యేసు గెత్సేమనే తోటలో పట్టబడిన తరువాత, ఆయన నేరుగా అన్న యొద్దకు తీసికొనిపోబడ్డాడు. ప్రధాన యాజకుడుగా పనిచేసి పదవీ విరమణ చేసినను అతని గౌరవార్థమై యింకా ప్రధానయాజకుడనే పిలువబడుచుండిన ఈయన యేసు యొక్క శిష్యులు మరియు బోధల గూర్చి ఆయనను ప్రశ్నించాడు (యోహాను 18:19-24). ఆయన చెప్పిన విషయాలు మరియు ఆయన చేసిన వింతల గూర్చి ఆయన ఎటువంటి దాపరికం లేకుండానే మాటలాడాడని యేసు అన్నకు విన్నవించాడు. దగ్గర నిలిచియుండిన బంట్రౌతొకడు యేసును నోటిమీద కొట్టాడు. యేసును ఎలాగైనా నిర్మూలించాలని రహస్యంగా యత్నించిన నాయకులలో అన్న కూడ ఒకడై యుండును. ఇట్టి ప్రయాసములో ఉండిన ఇతని నాయకత్వపు పాత్ర యేసును మొదట అతని యొద్దకు తీసికొని వెళ్లుటలో గల హేతువులలో ఒకటై యుండును.

(2) యేసు కేసును గూర్చియు యేసును ఏమి చేయవలెనోయను విషయము గూర్చియు అతని తుది తీర్పునిచ్చిన తరువాత, అన్న యేసును కయప యొద్దకు పంపించాడు (యోహాను 18:24). తెలతెలవారుచుండినప్పుడే, ఈ ప్రధానయాజకుడు అతనికి సాధ్యమైనంత మంది సన్హెడ్రిన్ సభాసభ్యులను అతని ఇంటిలో సమకూర్చాడు. యేసును పరీక్షించుచు, ఆయన దేవుని కుమారుడైన క్రీస్తో కాదో, చెప్పవలెనని కయప ఆయన చేత ప్రమాణం చేయించాడు (మత్తయి 26:63, 64). కయప యేసును ప్రశ్నించుట ముగింపుకు వచ్చినప్పుడు, యేసు క్రూరంగా అపహసింపబడ్డాడు (మార్కు 14:63-65). యేసు తీర్పులలో ఆయన ఈ విధంగా అపహాస్యము చేయబడుట ఇదే మొదటిసారి.

(3) న్యాయస్థాన ప్రాంగణములో, అప్పుడప్పుడు కూర్చుంటూ కొన్ని పర్యాయాలు ఇటూ తిరుగుచూ ఉండిన పేతురు, యేసును ఎరుగనని ముమ్మారు బొంకాడు (మత్తయి 26:69-75). పేతురు చివరిసారి బొంకిన వెంటనే యేసును యూదుల మహా సభ యెదుటికి తీసికొని వెళ్లారు. యేసు పేతురు వైపు తిరిగి చూచినది ఈ సమయంలోనే (లూకా 22:61). యేసు ముఖ దృశ్యము పేతురు హృదయంలో ఒక గొప్ప మారుమనస్సును కలిగించింది. పేతురు వెలుపలికి వెళ్లి తీవ్రంగా రోదించాడు.

(4) కయప, యేసును కలిసికొన్న తరువాత, యూదుల మహా సభాసభ్యులందరు ఉదయముననే కూడుకొనవలెనని అధికారికంగా వారిని ఆహ్వానించాడు (మార్కు 15:1 చూడుము). ఈ సమావేశంలో పిలాతుకు నివేదించు నిమిత్తము యూదుల మహా సభ యేసు కేసును సూత్రీకరించింది.

(5) ప్రధానయాజకులును ప్రజల పెద్దలును యేసును పిలాతు, యూదయ సమరయ ప్రాంతముల ప్రభుత్వాధికారి యొద్దకు తీసికొనివెళ్లారు. రోమా ప్రభుత్వ ప్రతినిధిగా, యేసు సిలువవేయబడక మునుపు పిలాతు యూదుల మహా తీర్మానముతో ఏకీభవించాల్సిందే (మత్తయి 27:1, 2). అప్పటికే రోమా ప్రభుత్వము పిలాతుపై ఒక కన్నేసి వుంచింది, గనుక ఆయన యూదులతో కార్యకౌశలముతో వ్యవహరించాల్సివుండిన యేసును ప్రేతోర్యములోనికి నడిపించారు. కానీ యూదులు మాత్రం ప్రేతోర్యములోనికి ప్రవేశించలేదు; ఏలయనగా వారు

ప్రేతోర్యమను అన్యజనుల ఇంటిలోనికి ప్రవేశించుట వలన వారు శిష్టాచారరీత్యా మలినమై ఆ నాటి సాయంకాల పస్కా భోజనములో పాల్గొనజాలరు (యోహాను 18:28).

(6) పిలాతు వెలుపలికి వచ్చి వారు యేసు మీద మోపుచుండిన నేరములను విన్నాడు (యోహాను 18:29-32). అప్పుడు, ఆయన విన్నవాటినిబట్టి కలవరము చెందినందున, మరలా ప్రేతోర్యములోనికి వెళ్లి యేసును తానే స్వయంగా ప్రశ్నించాడు (యోహాను 18:33-38). పిలాతు యేసును ముఖాముఖిగా కలుసుకొనుట ఇది మొదటిసారి. పిలాతు, "యూదుల రాజువు నీవేనా?" అని యేసును ప్రశ్నించాడు (33 వ.). అందుకు యేసు, "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు" అని సమాధానమిచ్చాడు (యోహాను 18:36).

(7) పిలాతు బయటికి వెళ్లి యేసులో ఆయన ఏ దోషమును కనుగొనలేదని అక్కడ ఉండిన యూదులకు ప్రకటించాడు. అయితే యేసు సిలువవేయబడవలసినదే అని ప్రధానయాజకులు పట్టుబట్టారు (యోహాను 18:38).

(8) ఈ సమయంలో, యేసును అప్పగించినందుకు ముప్పది వెండి నాణెములు పుచ్చుకొన్న యూదా వాటిని తీసికొనివచ్చి దేవాలయములో పారవేశాడు (మత్తయి 27:3-7). యేసుకు శిక్షపడునని యూదా ఒప్పింపబడ్డాడు. అతడు ఆ ముప్పది వెండి నాణెములను తిరిగి ఇచ్చివేసిన తరువాత, యూదా తన ప్రాణం తీసుకున్నాడు. అతడు పశ్చాత్తాపంతో పరివర్తనం చెందుటకు బదులుగా కేవలం పరితాపం చెందాడు.

(9) తానే స్వతంత్రంగా ఏంచేయాలో ఎటుతోచక, హేరోదు యెరూషలేములోనే ఉన్నాడని పిలాతు గుర్తుకు తెచ్చుకొన్నాడు (లూకా 23:6-11). గనుక ఈ సందిగ్ధావస్థకు హేరోదు దగ్గర ఏదైనా పరిష్కారముండకపోతుందా అని అనుకొంటూ, యేసును ఆయన యొద్దకు పంపించాడు. యేసు హేరోదు యెదుట మౌనంగా ఉన్నాడు. ఈ ముఖాముఖి ముగిసిన తరువాత, యేసు మరలా అపహాస్యము చేయబడ్డాడు (లూకా 23:11ఎ). యేసు ఇలా అపహసింపబడుట ఇది రెండవసారి.

(10) యేసు మరలా పిలాతు నొద్దకు పంపబడ్డాడు (లూకా 23:11బి). సమయము గడుచుచుండిన కొలది పరిస్థితి అంతకంతకు ఘోరంగా తయారగుచుండినది. ఆయన యెదుట ఒక క్లిష్టమైన పరిస్థితి ఉన్నదని పిలాతు అర్థంచేసుకొన్నాడు.

(11) గనుక పస్కా పండుగ సమయంలో ఒక ఖైదీని విడుదల చేయుట వాడుకగా నుండిన అభ్యాసమును పిలాతు తనకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని ఆశించాడు. కాబట్టి యేసు ప్రక్కలో బరబ్బ అను ఒక తిరుగుబాటుదారుని నిలువబెట్టి, ఇరువురిలో ఎవరిని విడుదల చేయవలెనని వారు కోరుకొందురో తెలుపుమని యూదులనడిగాడు (మత్తయి 27:15-18). బరబ్బనే విడుదల చేయబడవలెనని కోరుకొనుచున్నట్లు జనసమూహము వారి కేకలతో తెలియజేశారు.

(12) పిలాతు న్యాయస్థాన ఆసనముపై ఆసీనుడై ఒక ప్రకటనను సిద్ధంచేస్తూ ఉన్నాడు. ఇంతలో ఆకస్మికంగా, ఒక వార్తాహరుని ద్వారా, తన భార్య పంపించిన చీటీ నొకటి అందుకొన్నాడు. ఆ నాటి రాత్రి ఏదో ఒక సమయంలో, యేసు అని పిలువబడుచుండిన ఈయన గూర్చి ఆమె కలవరము కలిగించు ఒక కల కన్నది. ఈ కల దృష్ట్యా ఆయన జోలికి వెళ్లవద్దని ఆమె తన భర్తను బతిమాలింది (మత్తయి 27:19).

(13) పిలాతు నీళ్లు మరియు చేతులు కడుగుకొను పళ్లెము తీసుకరావలెనని కోరి,

ప్రజలందరి ముందు తన చేతులు కడుగుకొన్నాడు. తాను ఈ యేసు రక్తము విషయములో నిరపరాధియని ఆయన ఒక బహిరంగ ప్రకటన చేయుచుండెను (మత్తయి 27:24).

(14) ఈ సమయంలో, పిలాతు యేసును కొరడాలతో కొట్టించుటకు పంపియుంటాడు (మత్తయి 27:26; యోహాను 19:1). కొరడాలతో కొట్టించుట సిలువవేయబడుటకు ఒక ముందస్తు సూచన యని యూదులు అనుకొని, వారు కొంచెం శాంతించి అహింసా పథంలోకి వస్తారని ఆయన అనుకొనియుంటాడు. ఏది ఏమైనా, పిలాతు, యేసును కొరడాలతో కొట్టించి దానిని ప్రజల సానుభూతిని సంపాదించుకొనుటకు ఉపయోగించుకొనవచ్చుననియు తద్వారా యేసును విడుదల చేయవచ్చుననియు ఆయన అనుకొనియుండవచ్చును. యేసు నిర్దోషియను ఒప్పింపుతో ఆయన యేసు విడుదల కొరకు యింకా ప్రయాసపడుచుండెను.

(15) కొరడాలతో కొట్టింపబడిన తరువాత, పిలాతు యేసును జనసమూహము యెదుట నిలువబెట్టాడు. “ఇదిగో, ఈ మనుష్యుడు!” అని అన్నాడు (యోహాను 19:5). అందుకు ప్రధానయాజకులు వెంటనే కోపంతో, “వానిని సిలువవేయుము!” అని ఎదురు సమాధానం చెప్పారు (మత్తయి 27:23).

అప్పుడు పిలాతు, “ఆయనయందు ఏ దోషమును నాకు కనబడలేదు గనుక, మీరే ఆయనను తీసికొనిపోయి సిలువవేయుడి” అని చెప్పాడు (యోహాను 19:6). అందుకు ప్రధానయాజకులు, “మాకొక నియమము కలదు. తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమముచొప్పున ఇతడు చావవలెను” అని చెప్పారు (యోహాను 19:7).

(16) ప్రధాన యాజకులు చేసిన ఈ ప్రకటన పిలాతును కలతచెందింపజేసింది. గనుక ఆయన యేసును వెలుపలికి తీసికొనివెళ్లి ఆయనను మరలా ప్రశ్నించాడు (యోహాను 19:9–11). “నీ వెక్కడనుండి వచ్చితివి?” అనియు, “నీవు దేవుని కుమారుడవా?” అనియు యేసునడిగాడు. అయితే యేసు ప్రత్యుత్తరమేమియు చెప్పలేదు.

(17) పిలాతు యేసుతో కూడ వెలుపలికి వచ్చి, యేసును విడుదల చేయుటకు మరొక్కసారి ప్రయత్నిస్తూ, ఆయనను జనసమూహము యెదుట నిలువబెట్టాడు. అప్పుడు ప్రజలందరు, “నీవు ఇతని విడుదలచేసితివా కైసరునకు స్నేహితుడవు కావు” అని కేకలు వేశారు (యోహాను 19:12). ఈ మాటలు, పిలాతు చెవులకు, రోమా ప్రభుత్వమునకు పరోక్షంగా ఉత్పన్నమగు తదనంతర తీవ్ర పరిణామంగా వినిపించాయి. అంతకు మించింది ఆయన ఆలోచించలేకపోయాడు.

(18) మరలా తన న్యాయస్థాన ఆసనముపై ఆసీనుడగుచు (గబ్బతా అని పిలువబడిన చోట), పిలాతు యేసును ప్రజల ముందు ఒక ప్రదర్శనగా ప్రదర్శించాడు. అటుతరువాత తన చేతినూపుచూ, “ఇదిగో మీ రాజు!” అని పలికాడు. అందుకు జనసమూహము, “ఇతనిని సంహరించుము, సంహరించుము, సిలువవేయుము! ... కైసరు తప్ప మాకు రాజు లేడు” అని కేకలు వేసారు (యోహాను 19:14, 15).

(19) చిట్టచివరగా, పిలాతు ఆశలు వదులుకొని అంతటిలో ఆపుజేశాడు. బొత్తిగా తికమకపడిపోయి, దిగ్భ్రాంతిచెంది, యూదుల చేతిలో ఓటమిపాలై, ఆయన యేసును వారి ఇష్టమునకు అప్పగించాడు (యోహాను 19:16).

❖◆❖◆❖

*“అప్పుడు సిలువవేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను” (యోహాను 19:16); “కాగా వారడిగినట్టే జరుగవలెనని పిలాతు తీర్పు తీర్చు అల్లరి నిమిత్తమును నరహత్య నిమిత్తమును చెరసాలలో వేయబడియుండినవానిని వారడిగినట్టు వారికి విడుదలచేసి, యేసును వారికిష్టము వచ్చినట్టుచేయుటకు అప్పగించెను” (లూకా 23:24, 25); “పిలాతు జనసమూహమును సంతోషపెట్టుటకు మనస్సుగలవాడై వారికి బరబ్బను విడుదలచేసి యేసును కొరడాలతో కొట్టించి సిలువవేయనప్పగించెను” (మార్కు 15:15); “అప్పుడతడు వారు కోరినట్టు బరబ్బను వారికి విడుదల చేసి, యేసును కొరడాలతో కొట్టించి సిలువవేయ నప్పగించెను” (మత్తయి 27:26).*